క్లుప్తంగా

బస్సును పునరుద్ధరించాలి

వంగర: మండలంలోని కింజంగి గ్రామానికి ఇదివరకు ఉన్న ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో రాజాం నుంచి కింజంగికి బస్సు నడిపేవారని, ఆ తర్వాత దాని సేవలు నిలిపివేశారు. దీంతో కింజంగి గ్రామస్తులతో పాటు మరువాడ, ఇరువాడ, చౌదరివలస, చంద్రంపేట, కోనంగిపాడు, కింజంగి ఆర్అండ్ఆర్ కాలనీల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి, బస్సు సదుపాయం సమకూర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వస్త్రదానం

రేగిడి: స్థానిక ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ బ్రాంచి మేనేజర్ వంతరాం చంద్రమౌళి.. మండలంలోని వన్నలి గ్రామంలోని పలువురు నిరుపేదలకు వస్త్రదానం చేశారు. సర్పంచ్ గార రమణ చేతులమీదుగా ఆయన అందజేసిన వస్త్రాలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

నకిలీ పట్టాల తయారీదారులపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్లపట్టాలు తయారు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, పట్టణ అధ్యక్షుడు మునకాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముప్వల శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారంతా మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయానికి సోమవారం వెళ్లి, ఏవోకు వినతిపత్రం అందజేశారు. నకిలీ ఇళ్లపట్టాలతో పలువురిని మోసం చేస్తుండడం చట్టరీత్యా నేరమని, అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సీబీఎం స్కూల్ విక్రయంపై కూడా దృష్టిసారించాలన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని జీఎస్పురానికి చెందిన బొద్దూరు రాజు అనే వ్యక్తిపై కేసు నమోదైనట్లు హెడ్ కానిస్టేబుల్ వంజరాపు జనార్దనరావు సోమవారం తెలిపారు. ఆదివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన గృహిణి కంబాల శిరీషతో అసభ్యకరంగా మాట్లాడి, ఆమెను గాయపరచడంతో అతడిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం బాధిత మహిళ రాజాంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోందన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంఈవోలు ప్రసాదరావు, ఎరకయ్య

రేగిడి: స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లంతా బాధ్యతగా వ్యవహరించి, పనిచేయాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలు సూచించారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ల సమావేశం సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో మౌలిక వసతులతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సంక్రాంతి పండగకు అనాథ పిల్లలకు నూతన వస్త్రాల పంపిణీ చేపడుతున్నామని, ఆ కార్యక్రమం సక్రమంగా జరిగేలా చూడాలన్నారు.

పంటల బీమా నమోదు చేసుకోవాలి

మెంటాడ: రబీ సాగులో భాగంగా పండిస్తున్న వరి పంటకు సంబంధించి, ప్రీమియం చెల్లించి పంటల బీమా నమోదు చేసుకోవాలని ఏవో గోకుల్కృష్ణ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. ఇంతకుముందు ఈ గడువు 2024 డిసెంబరు 30వ తేదీ వరకు ఉండేదని గుర్తుచేశారు. అపరాల పంటలకు బీమా చేయించుకునేందుకు గడువు ముగియగా, వరి పంటకు మాత్రం ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఎకరా పొలానికి రూ.600 చెల్లించి, బీమా సదుపాయం పొందాలన్నారు. మండలంలో 30 శాతం మంది రైతులు కూడా బీమా నమోదు చేయించుకోలేదన్నారు. బీమా చేయించుకుంటే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే నష్టపరిహారం వస్తుందన్నారు.

నిబంధనల ప్రకారం పార్కింగ్ చేయాలి

రాజాం సిటీ: ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలను నిబంధనల ప్రకారం పార్కింగ్ చేయాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్కుమార్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ నెల 5వ తేదీన మండలంలోని రాజయ్యపేట జంక్షన్ వద్ద ఆగి ఉన్న కలప ట్రాక్టరును ఢీకొని కొండంపేటకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. వాహనాలు రోడ్డుపై నడిపేటప్పుడు నంబరు ప్లేట్లతో పాటు నాలుగు వైపులా రేడియం స్టిక్కర్లు కనిపించి నట్లు ఉండేలా చూసుకోవాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డు పక్కన వాహనం ఆపితే అందుకు గల నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బిక్కుబిక్కుమంటూ..



శిథిలావస్థకు చేరిన ఎంఆర్సీ భవనం



ఎంఆర్సీ భవనంలోనే పెచ్చులూడిన శ్లాబు (ఇన్సెట్లో)

- శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు
- బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధుల నిర్వహణ
- కూలిపోయే దశలో సాంఘిక సంక్షేమ వసతిగృహం
- ఏ క్షణాన ఏం జరుగుతుందోనని విద్యార్థుల భయాందోళన

రామభద్రపురం:

మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు సహా విద్యార్థుల సంక్షేమ వసతిగృహాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అటు అధికారులు.. ఇటు విద్యార్థులు బిక్కుబిక్కుమని వాటిల్లో ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా ఎంఆర్సీ కార్యాలయ భవనంతో పాటు పశువైద్యశాల, ప్రభుత్వ అతిథి గృహం, సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం ఇలా అన్ని భవనాలు ఇప్పుడు కూలిపోయే దశలో ఉన్నాయి. పెచ్చులూడిన శ్లాబులు, సగం ఊడిన కిటికీలు, అధ్వానంగా తలుపులు, పగిలిన గచ్చులతో ఆయా కార్యాలయాలు ఉన్నాయి. ఏ చిన్నపాటి వర్షం కురిసినా పెచ్చులూడిన శ్లాబుల ద్వారా వర్షపునీరు కారుతోందని అందులో ఉండేవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ భవనం చూసినా ఇది ఎప్పుడో ఒకప్పుడు కూలిపోతుందనే అనుమానం వస్తోందని, ప్రమాదం జరగకముందే కొత్త భవనాలు నిర్మించాలని ఉద్యోగులు, విద్యార్థులు కోరుతున్నారు. తుపాను రోజుల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని, ఉరుములు, మెరుపులతో పాటు పిడుగుల శబ్దాలు, భారీ ఈదురుగాలులు, వర్షాలకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సి వస్తోందని వాపోతున్నారు. భవనాలు దారుణంగా ఉన్న పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం కూడా జరిగిందని, అయినా చర్యలు శూన్యమన్న వాదనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం..



ఎంఆర్సీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షం పడితే చాలు లోపలకు నీరు కారి, రికార్డులు, విలువైన పుస్తకాలు తడిసిముద్దవుతున్నాయి. అలాగే విధుల నిర్వహణ కూడా చాలా భయంతో చేస్తున్నాం. ఎప్పుడు ఎక్కడ పెచ్చు ఊడి తలపై పడుతుందోనన్న భయం ఉంది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం.

–తిరుమలప్రసాద్, ఎంఈవో, రామభద్రపురం

ప్రతిపాదనలు పంపాం..



జిల్లాలో సుమారు 30 వరకు పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సిబ్బంది వైద్యసేవలందించేందుకు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. వాటిని తొలగించి, కొత్త భవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. గ్రాంటు మంజూరైన వెంటనే నిర్మాణాలు ప్రారంభిస్తాం.

–వైవీ రమణ, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి, విజయనగరం



అధ్వానంగా రామభద్రపురం పశువైద్యశాల



కూలిపోయే దశలో ప్రభుత్వ అతిథి గృహం

ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయం



వంగర మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు సోమవారం చేపట్టారు. ప్రకృతి సేద్యం మరువాడ యూనిట్ ఇన్చార్జి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ పండించిన కూరగాయలు, ఆకు కూరలు విక్రయించగా, వాటి కొనుగోళ్లకు సిబ్బంది ఆసక్తి కనబరిచారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు మెరుగైన ఆరోగ్యానికి ఉపయోగపడుతుండడంతో అటువైపుగా వెళ్తున్న వారంతా వాటిని కొనుగోలు చేసి, ఇంటికి తీసుకువెళ్లారు.

–వంగర

ప్లాస్టిక్ నిషేధంపై చర్యలేవీ?



రాజాం మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధం చర్యలు కానరావడం లేదు. దీంతో విచ్చలవిడిగా నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ కవర్ల వినియోగం పెరిగి, పర్యావరణ కాలుష్యం ఏర్పడుతోంది. జనావాసాల మధ్య కుప్పలుతెప్పలుగా పడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా దుర్గంధం వెదజల్లడంతో పాటు అపారిశుద్ధ్యం నెలకొని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మాటల్లోనే ప్లాస్టిక్ నిషేధం ఉంటుందని, చేతల్లో మాత్రం అది కనిపించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, దుకాణాదారులు పాలిథిన్ కవర్లు విక్రయించకుండా చూడాలని రాజాం గ్రీన్కోర్ కమిటీ కన్వీనర్ ఆర్వీజే నాయుడు కోరుతున్నారు.

–రాజాం

ముమ్మరంగా వరినాట్లు



రబీ సాగులో భాగంగా బాడంగి మండల వ్యాప్తంగా వరినాట్లు వేసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రేజేరు గ్రామ పొలాల్లో పలువురు రైతులు ఊభాలు వేసేందుకు సోమవారం నాట్లు సిద్ధం చేయగా, ఏ విధంగా నాట్లు వేస్తే అధిక దిగుబడులు వస్తాయన్న దానిపై వీఏఏ సాయికుమార్ అవగాహన కల్పించారు. నారు కొనలు తుంచి నాటుకుంటే పంటకు కాండంతొలిచే పురుగు పట్టదన్నారు. అలాగే పంట ఏపుగా పెరగాలంటే గాలి, వెలుతురు బాగా తగిలేలా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

–బాడంగి

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఎంఈవో జె.త్రినాధరావు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి విద్యాసామర్థ్యాలు అంచనా వేశారు. అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించేందుకు 100 రోజుల ప్రణాళికలు తయారు చేసి, వారితో సబ్జెక్టుల వారీగా సాధన చేయించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఇళ్లకు వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని, విద్యార్థులు బాగా చదువుకునేలా ప్రోత్సహించాలని తెలపాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం రమేష్ తదితరులు ఉన్నారు.

వైభవంగా పూలంగి సేవ

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని అత్యంత పురాతనమైన ఆలయంగా పేరొందిన రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పూలంగి సేవ సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. చినజీయర్స్వామి ఆశీస్సులతో ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో 60 రకాలకు చెందిన 12 టన్నుల పుష్పాలతో ఆలయాన్ని, ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు, మాజీ మంత్రి సుజయకృష్ణరంగారావు తదితరులు ఆలయాన్ని సందర్శించి, భగవంతునికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు.

పింఛన్దారుల అర్హతల పరిశీలన



దివ్యాంగుడి అర్హతలపై ఆరాతీస్తున్న వైద్యులు

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి, కోమటిపల్లి, జగన్నాథపురం, కమ్మవలస గ్రామాల్లోని దివ్యాంగ పింఛన్దారుల అర్హతలను వైద్యుల బృందం సోమవారం పరిశీలించింది. పింఛన్కు వారు అర్హులేనా.. వారి అర్హత తెలిపే ధ్రువపత్రాలను నిశితంగా చూసి, ధ్రువీకరించారు. అనర్హులు పింఛన్ డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఈ తరహా పరిశీలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యుడు రఘువంశీ తదితరులు పాల్గొన్నారు.

జయప్రకాష్కు ఘననివాళి

బాడంగి: మండల కేంద్రంలో దివంగత ఎమ్మెల్యే తెంటు జయప్రకాష్ వర్ధంతి సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన కుటుంబ సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జయప్రకాష్ భార్య సత్యవతి, కుమారుడు లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు నిర్వహిస్తే ఉపేక్షించం



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట, బెట్టింగులకు పాల్పడినా, నిర్వహించినా ఉపేక్షించేది లేదని సీఐ కె.నారాయణరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్స్టేషన్లో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కోడి పందాల నిర్వహణతో పాటు కోడికత్తుల తయారీ, కోడిపుంజులకు కత్తులు కట్టడం వంటివి చట్టవ్యతిరేక కార్యాకలాపాలని, అటువంటి వాటికి పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఇదే తరహా నేరాలకు పాల్పడి, అరెస్టయిన వ్యక్తులను స్టేషన్కు పిలిపించి, స్థానిక మండల మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ కేసులు కడుతున్నామన్నారు. ఏ విధమైన అసాంఘిక కార్యాకలాపాలు చేపట్టకుండా బాండులు రాయిపించి తీసుకుంటున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకునేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ వి.ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

తలగాంలో రెవెన్యూ సదస్సు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు ధర్మరాజు

వంగర: మండలంలోని తలగాం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు దిరిశాల ధర్మరాజు, సర్వే డీటీ జి.గంగాభవానిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రైతులు తమ భూ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు రైతులకు తెలిపారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని కాశిందొరవలస, నారాయణప్పవలస గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దారు శ్రీను పాల్గొని, రైతులు సమర్పించిన అర్జీలను స్వీకరించి, పరిశీలించారు. అయితే పలువురు రైతులు తాము సాగు చేస్తున్న డీ-పట్టా భూమిని జిరాయితీ భూమిగా మార్చాలని కోరగా, అలా చేయడం కుదరదని తహసీల్దారు స్పష్టం చేశారు. సాగుభూమి లేని నిరుపేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూమికి సంబంధించి, డీ-పట్టా అందజేస్తామని, అటువంటి దానిని జిరాయితీగా మార్చడం కుదరదన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రేగిడి: పనసలవలసలో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం



రాజాం: మేదరవీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

రేగిడి: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో శ్యామలాకుమారి సూచించారు. మండలంలోని పనసలవల గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఆమె సోమవారం పరిశీలించి, కాసేపు మాట్లాడారు. అవసరమైన చోట రోడ్లు, కాలువల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని మేదర వీధిలో రూ.11 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మిస్తుండగా ఈ పనులను ఏఈ వెంకట్ సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. పనులు సక్రమంగా నిర్వహించాలని కాంట్రాక్టరు లక్షునాయుడును ఆదేశించారు. దోసరి గ్రామ ప్రధాన వీధిలో 80 మీటర్ల పొడవునా సీసీ కమ్ డ్రెయిన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మండల పరిషత్ ద్వారా ఎంపీపీ లావేటి సులోచన మంజూరు చేసిన రూ.3 లక్షల వ్యయంతో పనులు జరుగుతున్నాయని సర్పంచ్ తులసీనాయుడు తెలిపారు.

ట్రాక్టరు దొంగ అరెస్ట్

రాజాం సిటీ: మండలంలోని రామానుజులపేటకు చెందిన పడాల వెంకటేష్ ట్రాక్టరును అపహరించిన దొంగను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వై.రవికిరణ్ సోమవారం తెలిపారు. ఈ నెల 2వ తేదీన రాజాం మండలం పరిధిలోని మొగిలివలస దగ్గరున్న పెట్రోలు బంకు సమీపంలో ఉంచి వెళ్లగా, మరుసటి రోజు వచ్చి చూసేసరికి అక్కడి ట్రాక్టరు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించి, బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా ట్రాక్టరు దొంగిలించిన వ్యక్తి సబ్బవరం మండలంలోని లింగాలతిరిడి గ్రామానికి చెందిన దాడి తేజ అని గుర్తించి, అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సదరు నిందితుడిపై గతంలోనూ బైక్ దొంగతనం కేసు కూడా ఉందన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని ఎన్.బూర్జవలస గ్రామంలో సర్పంచ్ నీలమ్మ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఎంపీడీవో రాంబాబు, ఈవోపీఆర్డీ నీలిమ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి దీపక్ గ్రామంలో అన్ని వీధుల కాలువల్లోని చెత్తాచెదారం, పూడికలు తొలగించి, కాలువల వద్ద బ్లీచింగ్, సున్నం కలిపిన పౌడర్ను చల్లించారు. దోమల నివారణకు ఈ చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు.

పీఎఫ్ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ రాజు

రామభద్రపురం: తక్షణమే పీఎఫ్(ప్రావిడెంట్ ఫండ్) బకాయిలు చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో వినియోగించుకునేందుకు దాచుకున్న పీఎఫ్ బకాయిలు చెల్లించకుండా ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సంవత్సర కాలంగా బకాయిపడిన పీఎఫ్ పార్ట్ ఫైనల్స్, లోన్లను తక్షణమే చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజులకే చెల్లించాల్సిన పీఎఫ్ మొత్తాలు నెలలు గడుస్తున్నా చెల్లించకపోతుండడం చాలా అన్యాయమన్నారు. ఉపాధ్యాయులకు యాప్ల భారం తగ్గించాలన్నారు. కేజీబీవీల్లో తెలుగు బోధకులను నియమించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న పార్ట్టైం బోధకులకు పూర్తి విధులు నిర్వహించేలా చేసి, మినిమం స్కేల్(వేతనం) చెల్లించాలన్నారు.

సత్వరమే పల్లెపండుగ పనులు పూర్తి చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: సత్వరమే పల్లెపండుగ పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సోమవారం సమావేశమైన ఆయన.. పల్లెపండుగ పేరిట ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫారంపాండ్స్, షిప్పాండ్స్, ట్రెంచ్ల నిర్మాణ పనులకు ఎక్కువ పనిదినాలు కేటాయించాలన్నారు. వ్యవసాయ సంబంధిత పనులకు కూడా ప్రాధాన్యమివ్వాలన్నారు. సమావేశంలో ఏపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు



చాటాయవలసలో విక్రయానికి సిద్ధం చేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి:

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు చేయడం జరుగుతోందని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని సంకిలి, చాటాయవలస తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు.